# గుట్టుగా గంజాయి సాగు

- రైతులను ప్రోత్సహిస్తున్న దళారులు
- మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లకు ఎగుమతి
- సాగు నియంత్రణకు చర్యలు శూన్యం



కిష్టాపూర్‌లో సాగు చేసిన గంజాయిని పట్టుకున్న పోలీసులు (ఫైల్)

**ఇచ్చోడ:** జిల్లాలో గంజాయి దందా గుట్టుచప్పుడు సాగుతోంది. ఇటీవల కాలంలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న సమయంలో పలువురు గంజాయి స్మగ్లర్లు పట్టుబడంతో గంజాయి దందా జోరుగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో సాగైన గంజాయిని మహా రాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఎగుమతి చేసి భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. గంజాయి సాగుపై నిషేధం ఉన్న సంబంధిత ఎక్సైజ్ శాఖ పట్టించుకోకపోవడంతో వర్ష కాలం పంటల సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా మారు మూల ప్రాంతాల్లో అంతర పంటగా గంజాయి సాగవుతోంది. దళారులు తమకు అనుకులంగా ఉన్న రైతులను ఎంపిక చేసుకొని వారితో గంజాయి సాగు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. పంట చేతికి రాగానే ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

**గంజాయికి డిమాండ్..**

జిల్లాలో సాగు చేస్తున్న గంజాయికి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో మంచి డిమాండ్ ఉంది. కొంత మంది దళారులు జిల్లా రైతులు పండించిన గంజాయి ఆకును కిలోకు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు, గంజాయి మొగ్గలను కిలో రూ. 5 వేల నుంచి రూ. 7 వేల వరకు కొనుగోలు చేసి రైలు మార్గాల ద్వారా తరలిస్తున్నారు. ఇలా అక్రమ దందా చేస్తూ.. కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారు.

**మారుమూల పల్లెలో..**

బజార్‌హత్నూర్, నేరడిగొండ, గుడిహత్నూర్, సిరికొండ, గాదిగూడ, ఇంద్రవెల్లి, తలమడుగు, నార్నూర్, బేల మండలాల్లోని మారుమూల గ్రామాలను గంజాయి సాగు దళారులు ఎంచుకుంటారు. వానాకాలం పంట సాగుకు ముందే ఎంపిక చేసుకున్న గ్రామాలకు వెళ్లి రైతులతో మాట్లాడి గంజాయి సాగుపై అవగాహన కల్పిస్తారు. విత్తనాలు అందించి సాగు కోసం ముందుస్తుగా కొంత డబ్బు అందిస్తారు. ఈ వ్యవహారమంత మూడో కంటికి తెలియకుండా రహస్యంగా సాగుకు చేయిస్తుంటారు.

**ఇటీవల పట్టుబడిన గంజాయి..**

- జనవరి 28న జిల్లా కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న షంశీర్, షబాబ్‌లను టూటూన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 75 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.
- మార్చి 25న జిల్లా కేంద్రంలో సుభాష్‌నగర్‌కు చెందిన ఖాలీం గంజాయి విక్రయిస్తుండగా కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు.
- ఏప్రిల్ 4న బేల మండలంలోని సాంగి(జి) నుంచి ఆదిలాబాద్ వైపు గంజాయి తరలిస్తుండగా 7 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.
- ఏప్రిల్ 14న నార్నూర్ మండలంలో బైక్‌పై 18 కిలోల గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.
- ఏప్రిల్ 14న గాదిగూడ మండలంలోని లోకారి(బి)లో అక్రమంగా తరలిస్తున్న ఒకటిన్నర కిలో గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.
- ఏప్రిల్ 17న గుడిహత్నూర్ మండలంలోని ముత్నూర్ శివారులో 500 గ్రాముల గంజాయి తరలిస్తున్న షేక్ జావిద్, పడిగేల వెంకటేశ్‌లను పోలీసులు పట్టుకున్నారు.
- మే 3న గుడిహత్నూర్ మండలంలోని మచ్చాపూర్ సమీపంలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. సాగు చేస్తున్న వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.
- జూన్ 12న గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను నేరడిగొండ పోలీసులు పట్టుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన పాపిశెట్టి, సంతోష్‌కుమార్ ఇంద్రవెల్లి మండలంలోని ధర్మసాగర్ గ్రామం నుంచి 7 కిలోల గంజాయి కొనుగోలు చేసి తరలిస్తుండగా నేరడిగొండ మండలంలోని రోల్ మామడ టోల్ ప్లాజ వద్ద తనిఖీలో పట్టుబడ్డారు.

### గంజాయి స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం



గంజాయి స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపుతాం. స్మగ్లింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గంజాయి సాగు చేసే వారికి రైతుభరోసా రాకుండా జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాం. గత రెండు నెలల నుంచి స్మగ్లర్లపై 37 కేసులు నమోదు చేశాం.

– జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్, డీఎస్పీ

### విరిగిన స్తంభం.. నిలిచిన విద్యుత్ సరఫరా



బైపాస్ రోడ్డులో విరిగిన స్తంభం

**తాంసి:** రాంపూర్ శివారులో బైపాస్ రోడ్డు సమీపంలో గుర్తు తెలియని వాహనం శనివారం రాత్రి 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో స్తంభం విరిగింది. దీంతో తాంసి, భీంపూర్ మండలాల్లోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తాంసి, భీంపూర్ ఏఈలు మనోజ్, శ్రావణ్ కుమార్ సిబ్బందితో వచ్చి యుద్ధ ప్రాతిపదికన పనుల చేపట్టారు. ఆదివారం ఉదయం 10 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

### ప్రమాదకరంగా గుంతలు



గుంతలు పడిన రోడ్డు

**బేల:** మండలంలోని 353బీ 17 కిలోమీటర్ల నేషనల్ హైవే మార్గంలో గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఈమార్గంలోని సిర్సన్న, పాటన్, కొబ్బాయి రెవెన్యూ గ్రామాల శివారుల్లోని వంతెనల వద్ద గుంతలు ఏర్పాడ్డాయి. వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చి వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## క్లుప్తంగా

### రోగులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఇంద్రవెల్లి:** ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పుట్టిన రోజును పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోరోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, నాయకులు ఎండీ మసుద్, జహీర్, జితేందర్, మెస్రం నాగ్‌నాథ్, సోమోరే నాగోరావ్ తదితరులు పాల్గొన్నారు.

### ఈద్గా వద్ద ఏర్పాట్లు పూర్తి



ఈద్గా పరిసరాలు శుభ్రం చేస్తున్న కార్మికులు

**ఇచ్చోడ:** మండల కేంద్రంలోని ఈద్గా మైదానం వద్ద ఆదివారం పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు పరిసరాలను శుభ్రం చేయించారు. సోమవారం బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఏర్పాట్లు చేయించినట్లు తెలిపారు.

### పరామర్శ



పరామర్శిస్తున్న ఆడే గజేందర్

**నేరడిగొండ:** మండలంలోని శంకరపూర్ గ్రామానికి చెందిన జాదవ్ రాజేశ్వర్ ఇటీవల మృతి చెందాడు. కాగా ఆదివారం బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బోథ్ బ్లాక్ ప్రెసిడెంట్ ప్రఫుల్ రెడ్డి, బద్దం పోతారెడ్డి, రాజురెడ్డి, శంకర్, కపిల్, తదితరులు పాల్గొన్నారు.

**ఇంద్రవెల్లి:** నిర్మల్ జిల్లా ఐకేపీ ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న, ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి గంగన్న ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ ఆదివారం కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పరంగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, జితేందర్, సుద్దోధన్, గోవింద్, దత్త పాల్గొన్నారు.

### 'గోవధను అరికట్టాలి'



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

**తలమడుగు:** బక్రీద్ పండుగకు గోవధను అరికట్టాలని తలమడుగు పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకుల ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా బీజేవైఎం మండల బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇటీవలే ఎమ్మెల్యే రాజాసింగ్ వేసిన పిటిషన్ పరిశీలించి గోవధ, గోవుల అక్రమ రవాణా జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. అదేవిధంగా పశువులను సంరక్షించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దాతజీ కిరణ్, పొట్టిపెల్లి శ్రీనివాస్, గోడం భుజంగ్‌రావు, గిరిజన మోర్చా కోరండ్ల పురుషోత్తం, చెలక గంగాధర్ పాల్గొన్నారు.

**నేరడిగొండ:** బక్రీద్ రోజు గోవధ జరగకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఆదివారం నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్, చొక్కపెల్లి రాములు, జాదవ్ పరశురాం, భూమేష్‌చారి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఎంపీ నగేశ్‌కు సన్మానం

**తాంసి:** పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా విజయం సాధించిన గోడం నగేశ్‌ను తాంసి మండల కేంద్రంలో సన్మానించడం జరుగుతుందని పార్టీ సీనియర్ నాయకుడు సదానంద్ తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామాభివృద్ధి కమిటీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సన్మాన సభకు మధ్యాహ్నం 12 గంటలకు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న గ్రామస్తులు



పూజలు చేస్తున్న మహిళలు

**తాంసి:** మండలంలోని పొన్నారి గ్రామంలోని శ్రీమహాలక్ష్మి ఆలయ 6వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలో హోమం, అర్చన చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవారికి అభిషేకం, అలంకరణతో పాటు పూజలు చేశారు. గ్రామస్తులతో పాటు భక్తులు ప్రత్యేక పూజలు చేసి మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కిరణ్, నర్సింగ్ చారి, గణేష్, రఘు, రమణ, అండే అశోక్, లక్ష్మి పతి, చంద్రన్న పాల్గొన్నారు.

**తలమడుగు:** మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ 45వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వేద పండితుల మత్రోచ్చరణల మధ్య అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించి 45 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఆలయ నిర్మాణంతోనే గ్రామం అన్ని రంగాల అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం ఆలయ పూజారి కల్యాణ్ కుమార్ అభిషేకం, అర్చన, పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తిరుపతిరెడ్డి, రాంరెడ్డి, పద్మాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న యువకులు, నాయకులు

**నేరడిగొండ:** నేరడిగొండ మండల కేంద్రంలోని ఆయన నివాసం వద్ద ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ అభివృద్ధి కోసం అనిల్ జాదవ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ శుభాకాంక్షలు తెలిపారు.

**ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు**

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదిన వేడుకల సందర్భంగా ఆదివారం తన స్వగ్రామమైన రాజుర గ్రామంలో గల శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జగదాంబ దేవి ఆలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆయన సతీమణి హరిప్రియ, కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని శివాలయంలో హోమం, అభిషేకం నిర్వహించారు.

**గొడుగుల పంపిణీ**

ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్ ఆదివారం మండలంలోని చించోలి గ్రామంలో గ్రామస్తులతో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చించోలి గ్రామ విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేశారు. నాయకులు భీమ బుచ్చన్న, ఆడె గోపాల్, జాదవ్ విజయ్, వినయ్, రాకేశ్, గ్రామపటేళ్లు, తదితరులు పాల్గొన్నారు.

**బోథ్:** బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ జన్మదినం సందర్భంగా ఆయనకు ఆదివారం మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. నేరడిగొండలోని ఎమ్మెల్యే నివాసంలో ఎంపీపీ తుల శ్రీనివాస్‌తో పాటు నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న జోగురామన్న

## భారీగా వెలుస్తున్న ఇసుక డంపులు

- టిప్పర్ల ద్వారా మహారాష్ట్రకు తరలింపు
- పట్టించుకోని అధికారులు



ఉపశ్నాల శివారులో ఇసుక డంప్‌లు

**బేల:** మండలంలోని కొబ్బాయి, శంకర్‌గూడ, ఉపశ్నాల శివారుల్లో గత వారం రోజులుగా భారీగా ఇసుక డంపులు వెలిశాయి. వర్షకాలం ప్రారంభమైన నేపథ్యంలో గుడిహత్నూర్, ఆదిలాబాద్, నార్నూర్, గాదిగూడ మండలానికి చెందిన పలువురు అక్రమార్కులు మండలంలోని కాంగార్‌పూర్ శివారులోని పెన్‌గంగ నుంచి పగలు, రాత్రి అనే తేడా లేకుండా లారీల ద్వారా ఇసుకను తరలించి, మహారాష్ట్ర వైపు ఉన్న సరిహద్దు రెవెన్యూ గ్రామాల శివారుల్లో డంప్ చేస్తున్నారు. కొన్నిసార్లు టిప్పర్‌లను నేరుగా మహారాష్ట్రలోని గ్రామాలకు తరలించి, ఒక్కొక్కటి రూ.40 నుంచి 60వేలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అక్రమ ఇసుక దందా అధికారులకు తెలిసినప్పటికీ కనీసం చర్యలు చేపట్టడం లేదు. ఇకనైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆవులను అక్రమంగా తరలిస్తే చర్యలు



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ భీమేశ్

**ఇచ్చోడ:** ఆవులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇచ్చోడ సీఐ భీమేశ్ హెచ్చరించారు. ఆదివారం ఆయన కార్యాలయంలో సాక్షితో మాట్లాడారు. ఇచ్చోడ సర్కిల్ పరిధిలో పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలి పారు. మండల కేంద్రంలో నిర్మల్, ఆదిలా బాద్ బైపాస్‌తో పాటుగా గుడిహత్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద, రోల్‌మామడ టోల్ ప్లాజ్ వద్ద పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అన్ని పోలీస్టేషన్‌ల పరిధిలోని 24 గంటల పాటు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి**

**బోథ్:** బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బోథ్ ఎస్సై రాము అన్నారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రతిఒక్కరూ సాదరభావంతో బక్రీద్‌ను జరుపుకోవాలన్నారు. మతసామరస్యానికి ప్రతీకగా పండుగను జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

**ఆదిలాబాద్:** ముదిరాజ్‌ల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ ముదిరాజ్ సంఘం నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పట్టణంలోని ముదిరాజ్ సంఘం భవన నిర్మాణం, దేవాలయ నిర్మాణం అసంపూర్తిగా ఉందన్నారు. ముదిరాజులు వృత్తిపరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ముదిరాజుల సమస్యల పరిష్కారానికి తోడ్పాటును అందిస్తానన్నారు. అసంపూర్తిగా ఉన్న భవనం, దేవాలయ నిర్మాణాలకు ప్రభుత్వపరంగా నిధులు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం పట్టణ కార్యదర్శి దారవేణి రాము, ప్రధాన కార్యదర్శి దార్శరవి, మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య, బొజ్జ నారాయణ, బొమ్మెన లస్మన్న, దొంతుల ప్రవీణ్ పాల్గొన్నారు.

## మూలన పడిన పిండి గిర్నీలు

- పీఎం ఫుడ్ ప్రాసెసింగ్ కింద యూనిట్లు మంజూరు
- ఏడాదిగా ఇవ్వని విద్యుత్ కనెక్షన్‌లు



నిరుపయోగంగా పిండి గిర్నీ

**బేల:** ఇందిరా క్రాంతి పథకం మండల సమైఖ్య పరిధిలో స్వయం సహాయక సంఘాల మహిళలకు స్వయం ఉపాధి కోసం మండలానికి మంజూరైన 7 పిండి గిర్నీలు మూలనపడ్డాయి. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీమ్ కింద ఈయూనిట్లు మంజూరయ్యాయి. ఏడాదిగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**మహిళల అభ్యున్నతి కోసం..**

స్వయం సహాయక సంఘాల మహిళల అభ్యున్నతి కోసం ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీమ్ కింద మండలానికి ఏడు పిండి గిర్నీల యూనిట్లు మంజూరయ్యాయి. 10 శాతం భాగస్వామ్య వాటాతో 35 శాతం సబ్సిడీపై రూ.2 లక్షల వ్యయం ఉంటుంది. బేల, చప్రాల, సోన్‌కాస్, సదల్‌పూర్, సిర్సన్న, టాక్లీ, సైద్‌పూర్ గ్రామాల్లో ఐకేపీ అధికారులు ఈపథకం కింద అర్హులైన మహిళలకు ఎంపిక చేసి ఒక్కొక్క యూనిట్ మంజూరు చేశారు. యూనిట్లు ఏర్పాటు చేసే క్రమంలో సంబంధిత స్థలంలో విద్యుత్ కనెక్షన్ ఇచ్చే సాధ్యత ధ్రువీకరణ పత్రాల (విద్యుత్ శాఖ మండల ఏఈ పీసీబీలిటీ సర్టిఫికెట్) ఆధారంగా పిండి గిర్నీలు మంజూరయ్యాయి. దీంతో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా రూ.2 లక్షల వ్యయంతో గత జూన్‌లో గిర్నీలు ఏర్పాటయ్యాయి.

**విద్యుత్ కనెక్షన్ లేక..**

గిర్నీల నిర్వహణకు విద్యుత్ అధికారుల సూచనల మేరకు సింగిల్ ఫేజ్ (5 వేల వాట్స్) విద్యుత్ కనెక్షన్‌ల కోసం రూ.13 వేల పైబడి రుసుం ఛార్జీలతో మీసేవలో ఆన్‌లైన్‌లో విద్యుత్ శాఖకు సంబంధిత లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఇప్పటి దాకా కనెక్షన్ ఇవ్వలేదు. కనెక్షన్‌ల కోసం మహిళలు, ఐకేపీ అధికారులతో కలిసి విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా.. ఎలాంటి ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పుడేమో ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకోవాల్సి ఉంటుందని, ఒక్కొక్క పిండి గిర్నీ కోసం ప్రత్యేకంగా విద్యుత్ కనెక్షన్ మంజూరు కోసం ప్రతిపాదనల అధారంగా విద్యుత్ శాఖకు మీ సేవ ద్వారా ఆన్‌లైన్‌లో రూ.2 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో మహిళలు ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని మహిళలు కోరుతున్నారు.

### విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు



పిండి గిర్నీల సబ్సిడీ యూనిట్ కోసం విద్యుత్ అధికారులు కనెక్షన్ ఇస్తామంటేనే దరఖాస్తు చేసుకున్నాం. బ్యాంకు అఫీసర్లు రుణం మంజూరు చేయడంతో పిండి గిర్నీ సామగ్రి తెచ్చుకున్నాం. గత జూలై నెలలో విద్యుత్ కనెక్షన్ కోసం మీసేవలో దరఖాస్తు చేసుకున్నాం. ఇప్పటిదాకా కనెక్షన్ ఇవ్వలేదు.

-కాంబ్లే రాధ, అంబేద్కర్ కాలనీ బేల

### రూ.2 లక్షలంటే ఎట్లా?



పిండి గిర్నీ యూనిట్ విలువనే రూ.2 లక్షలు. విద్యుత్ కనెక్షన్ కోసం గత ఆగస్టు నెలలోనే రూ.13 వేల పైబడి మీ సేవ కేంద్రంలో చెల్లించాం. ఇప్పుడేమో విద్యుత్ కనెక్షన్ కోసం అంచనాలు, ప్రతిపాదనలు అంటూ.. రూ.2 లక్షలంటే ఎట్లా. ఇదంతా ముందే తెలుస్తే పిండి గిర్నీ యూనిట్ ఎందుకు తీసుకుంటాం.

– మంజూషా, మండల సమైఖ్య అధ్యక్షురాలు బేల

### భీమన్న దేవుడికి పూజలు



పూజలు చేస్తున్న ముదిరాజ్ కులస్తులు

**బోథ్:** మండలంలోని పొచ్చేర గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భీమన్న, పెద మ్మ తల్లికి ఆది వారం ప్రత్యేక పూజ లు చేశారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని మొ క్కుకున్నారు. నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.